# ఆ రాత్రి

శ్రీ కస్తూరి లక్ష్మీనారాయణ

ప్రొద్దువాలిపోయింది. క్రుంకిపోయిన సూర్యుడి కిరణాలకు, పశ్చిమాకాశానవున్న వెండిమబ్బులు కాలి, ఎర్రగా పచ్చగా వెలుగుతున్నాయి. సంచారానికి వెళ్లిన పక్షులు బృందాలు బృందాలుగా గూళ్లకు చేరుకుంటున్నాయి. కాలువ ఒడ్డునవున్న సర్వితోపులో ఏవో పక్షులు కూర్చుని గోల చేస్తున్నాయి. కొంచెం ఇవతలగావున్న గుడిసెలలోనుంచి లేచిన పొగ చుట్టూ వ్యాపించి వాతావరణాన్ని తెల్లగా చేస్తోంది.

మల్లి ఏడుస్తున్న పిల్లవాణ్ణి చంక నేసుకుని గుడిసెలోనుంచి బయటకు వచ్చింది. బయట కుక్కిమంచంలో కూర్చునివున్న మల్లి ముసలిఅత్త మంగమ్మ, ఎదురుగావున్న చింతచెట్టు గుబురులోకి చూస్తోంది. గడచిపోయిన తన జీవితంలోని ఏవేవో సంఘటల్ని తలుచుకుని అప్పుడప్పుడు గొణుక్కుంటోంది. పిల్లవాణ్ణి భుజం మీద పడుకోబెట్టుకుని జోకొడుతూ సముదాయిస్తోంది మల్లి. కాని వాడి ఏడుపు మాత్రం ఆగటంలేదు. మంగమ్మ తన జ్ఞాపకాలలోనుంచి బయటపడి, మల్లివైపు తిరిగి, "ఏందే! ఆడి జరం యింకా దిగిపోనేదా?" అని అడిగింది.

మలి పిల్లవాడి మెడమీద, వీపుమీద చెయ్యి వేసిచూసి అంది, "మద్దెనేలకాడికి నయమే నత్తా. సాయంత్రపేల అర్దరూపా యెట్టి మందు తెచ్చి పోస్తిని గిందా! మునివాపుకే తగ్గి పోద్ది పొమ్మన్నాడు, డాకటేరు బాబు."

నగరానికి వెలుపలగా వున్న యీగుడిసెలకు దగ్గరలో ఒక చిన్న డిగ్రీవున్న డాక్టరు ఉన్నాడు. ఆయన ఈ బీదలందరికీ ఏరోజు దారోజు పావలా, అర్ధా తీసుకుని మందులిచ్చి పంపుతుంటాడు. అంతకంటే ఎక్కువ ఇచ్చుకోలేని జనమంతా అక్కడికే పోతుంటారు. అందుకే ఆయన ఆసుపత్రికి "బీదల ఆసుపత్రి" అని కూడ పేరు వచ్చింది.

మసక చీకటి క్రమంగా నల్లబడుతోంది. కాలువకు అవతలి ప్రక్కనున్న తుమ్మబీడు ఆకుల సందునుంచి, ఉదయిస్తున్న చంద్రుడు ఎర్రగా కన్పిస్తున్నాడు. మంగమ్మ మంచం మీద కొంచెం సర్దుకు కూర్చుని, "ఆణ్ణి నాకిచ్చి పోయే. గాలికి తొంగుంటడు. ముందు నువ్ పోయి కూడొండిపడెయ్...... ఈరణ్ణ వచ్చేయేల గూడయింది" అంది. పిల్లవాణ్ణి అత్తచేతి కందించింది మల్లి; "మాఁవేందో అణ్ణానికి మద్దెనేల రాలే దత్తా, యాడికి పోయిండో ఏమో!" అనుకుంటూ గుడిసెలోనికి పోయింది. మంగమ్మ పిల్లవాడికి జోకొడుతూ, మసగ్గా కన్పించే సర్వితెట్లలోకి చూస్తూ మళ్లీ తన భూతకాలానికి రంగు లేసుకుంటూ వెళ్లిపోయింది.

మల్లి లోపలికి వచ్చి చూసేసరికి పొయ్యిలో మంట ఆరిపోయి, పొగ వస్తోంది. కుండ తీసి ప్రక్కన పెట్టి, లోపల బూడిదంతా లాగేసి, వెదురుగొట్టంతో వూది మంట చేసింది. మళ్లీ కుండ పొయ్యిమీద పెట్టి ప్రక్కనే వున్న చితుకులు ఒక్కొక్కటీ పెట్ట సాగింది. మంటల్ని చూస్తూ కూర్చుంటే చిన్నప్పటి సంగతులు ఏమిటేమిటో గుర్తుకు రాసాగినై.

*　　　*　　　*

అప్పుడు తనకు పదిపదకొండేళ్లు ఉంటాయేమో! చిన్న తమ్ముణ్ణి తన కిచ్చి, తల్లి కాలనీ ఇళ్లలో పనిచేసి రావటానికి వెళ్లింది. తండ్రి అప్పటికి రెండు మూడు నెలలనుంచి అంతులేడు. తల్లి పనిచేసే యిళ్లల్లో ఎవరన్నా పెట్టే చద్దెన్నమూ, నెలాఖరుకు వచ్చే పది పన్నెండు రూపాయిలతో తమ జీవితం వెళ్లమార్చుకోవటానికి ఆధారంగా ఉండేవి. ఆరోజున తండ్రి అకస్మాత్తుగా యింట్లోకి వచ్చాడు. అప్పుడు త నిలాగే కూర్చుని కొద్దిగా నూకలుంటే, ఎండుటాకులుపెట్టి ఉడకేస్తోంది.

వస్తూనే చుట్టూ ఒకసారి కలియ చూసి, "అమ్మేడికి పోయిందే?" అని అడిగాడు. అతని వాల కమూ, అదీ చూస్తుంటే తన కేమీ సమాధానం చెప్పటానికి మనస్కరించలేదు. మెదలకుండా అతని ముఖం చూస్తూ కూర్చుంది.

"ఏందేశ్, కొవ్వు బలిసిందేటే, నా పెశ్నకి సమాధానం సెప్పవ్?" అని గద్దిస్తూ మల్లి దగ్గరకు వచ్చాడు. అప్పుడు తను చెదిరిపోయి, తత్తరలాడుతూ "కాలనీ ఇల్లల్లో పనిచేసి రాటాని కెల్లింది" అని నసిగింది. ఇంకేమీ మాట్లాడకుండా పరిచివున్న ఈతాకుల చాపమీద వాలాడు. అతని దగ్గరనుంచి ఏదో వాసన వస్తోంది.

"పొయ్యి మీద్దేందే, నూకలా? బియ్యమా? ఉడుక్కురాంగనే సెప్పు" అని ఇంకొక ఆజ్ఞ జారీ చేసి మొహంమీద చెయ్యి కప్పుకుని పడుకున్నాడు. తను కుండలో కలియబెడుతూ కూర్చుంది. తన పక్కనే తమ్ముడు చేటపెట్టి ఆడుకుంటున్నాడు. తండ్రి వాణ్ణి దగ్గరకు తీసుకోకపోగా చివరకు పలుక రించనన్నాలేదు. ఆ వయసులోనే తన కెందుకో అతన్ని చూస్తూవుంటే తండ్రిని చూస్తున్నట్లుండేది గాదు. ప్రక్కింటి రాములుకోసం బట్వాడా అయిన సాయంత్రమే వస్తుండే కాబూలీవాడే గుర్తుకు వస్తుండే వాడు. తను వెనుకకు తిరిగి చూసేసరికి కునుకు తీస్తు న్నాడు. అన్ని రోజులనుంచి ఎక్కడెక్కడ తిరిగి వస్తు న్నాడో ఏమో!

తను కుండ దించి ప్రక్కకుపెట్టి పొయిలో నుసిలాగి నీళ్లు చల్లుతుంటే లేచి కూర్చున్నాడు తండ్రి.

"ఏదే, ఆ సత్తు డేగిసా ఇటెయ్యి. ఆ కుండ కూడ యిటెట్టు."

మల్లేమీ మాట్లాడకుండా ముంతతో నీళ్లిచ్చి, కంచం, కుండ దగ్గర పెట్టింది. క్రిందటి సాయం త్రం తల్లి ఎవరింట్లోనో తెచ్చిన కాస్త ఎండుకారం వుంటే వేసింది.

సగం కుండల్లా ఖాళీచేసి, మిగిలింది తన ముందరకు నెట్టి, "ఇది నువ్వూ, ఆడూ తినండే, నే యెల్లిపోతుండా" అని ముంతెడు నీళ్లు గటగటా త్రాగేసి కాళ్లూ, చేతులూ వూపుకుంటూ వెళ్లి పోయినాడు. తన తల్లేం తినాలో అడుగుదా మనిపిం చిందిగాని, గొంతులో మాట గొంతులోనే ఉండి పోయింది. తనకు వూహ తెలిసినప్పటినుంచీ ఏనాడూ తల్లి సంగతీ, తన సంగతీ తండ్రి పట్టించుకున్నట్లు గుర్తు లేదు.

తల్లి రాగానే సంగతంతా చెప్పింది తను. విని మెదలకుండా వూరుకుందామె. ఒక్కమాట కూడ మాట్లాడలేదు. తర్వాత తనకూ, తమ్ముడికీ పంతులు గారింట్లో తెచ్చిన పులుసు కలిపి ముద్దలు పెట్టింది. తరువాత తానేమో కుండలో మిగిలిన నూకలన్నమూ, తను తెచ్చుకున్న చద్దీ కలిపి నీళ్లు పోసుకుని ఉప్వేసి కలుపుకుని త్రాగేసింది.

*　　　*　　　*

తల్లి జ్ఞాపకాలతో మల్లికి కళ్లలో నీళ్లు తిరిగాయి. పమిటె కొంగుతో తుడుచుకుంటూ, "ఏం జలమో ఏందో, ఒక్కనాటికీ సుకం నేక పోయె" అనుకుంది.

ఇంతలో ఎవరో బయటి నుంచి కేకేశారు, "ఎవరు లోపల? మల్లెమ్మా?" మల్లి బయటకు వచ్చింది. రాములు నిలుచుని ఉన్నాడు.

"ఏంది రాములా, ఏటి సంగతి?"

"మీ సుబ్బులు, ఆ దెవుడో యింకోడు యాపారంలో టూబులు తెత్తుంటే పోలీసులు కాసిం డ్రంట. సుబ్బులుగాడేమో టూబు లాడ పారేసి పారి పోయిండు. ఆ నెండోవోడు సిక్కిపోనాడంట. ఆనక పోలీసు లొత్తారేమో. కాత్తె సూసుకోండి" అన్నాడు రాములు.

రాములు మాటలకు మల్లి బెదిరిపోయింది.

"టూబులతో యాపారం సేస్తుండడా సుబ్బులు! అయినా పోలీసోల్లు ఈడకెందు కొస్తరు? ఆడేమైన ఈడ ఉంటుండా డంటవా, పెట్టుండా డంటవా? ఈడకేం పని?"

రాములు తాపీగా చుట్ట ఒక పీల్పు పీల్చి, "సుబ్బు లేడుంటడో పోలీసుల కెట్ట తెలుస్తది? ఆడిదివర కీడ వుండి పోయిండుగెంద! అణ్ణా, వదినె యాడ ఉన్నారని తెలిస్తే కనుక్కుపోదామని వస్తరు.. ఏదీ......ఈరిగాడు వచ్చినట్టులేదే. ఆడు రాగానే బేగి సెప్పమ్మాయ్. నే పోతుండా." అని భుజంమీది కండువా తీసి తలకు చుట్టుకుంటూ వెళ్లిపోయినాడు.

మల్లికి మనసంతా ఆందోళనతో నిండి పోయింది. తన మరిది సుబ్బులు ఈ వ్యాపారం

చేస్తున్నాడని తనకుగాని, వీరన్నకుగాని ఇంతవరకు తెలియదు. సంవత్సరం క్రితంవరకు ఇక్కడే వుంటూ పనీ పాటా చూసుకుంటూ ఉండేవాడు. ఏదన్నా సంపాదించిన రోజున తెచ్చి మల్లికే యిస్తుండేవాడు. నగరానికి అవతలివైపున కట్టిన ఫ్యాక్టరీలో ఏదో పని కుదిరిందనీ, అక్కడికీ, ఇక్కడకూ తిరగటం కుదరదనీ, తనక్కడే ఏదన్నా గుడిసె తీసుకుని ఉడకేసుకుంటాననీ వెళ్లిపోయి, ఈ సంవత్సరంనుంచీ అక్కడే ఉంటున్నాడు. చూచి పోవటానికి అప్పుడపుడు వస్తుంటే, వాడి ఇస్త్రీ బట్టలూ, చెప్పులూ చూసి వీరన్న, మల్లి కూడ సంతోషించారు మంచి పనికే కుదిరాడని. వచ్చినపుడల్లా పిల్లవాడికి ఏదో ఒకటి తెచ్చేవాడు. "ఈ యేడన్నా ఆడికి మను వేడన్నా సూడాలి మల్లీ" అని అనుకుంటున్న వీరన్న మాటలు జ్ఞాపకం వచ్చి నిట్టూర్చింది మల్లి. "ఇప్పటి కీడు తయారయ్యిండు, యాపారానికి మల్లా" అని గొణుక్కుంది.

మంగమ్మ మనవణ్ణి డొక్కలో పడుకోబెట్టుకుని కుక్కిలో సన్నగా గురక తీస్తోంది. అత్తను లేపి సుబ్బులు సంగతి చెపుదామనుకుంది మల్లి. కాని మళ్లీ ముసలిదాని మనసు బాధపడుతుందేమో ననుకుని మానేసింది. గుడిసెలో పొయ్యి దగ్గరకు వెళ్లింది. కుండలో అన్నం ఉడికి వుంది. కుండ దించి ప్రక్కన పెట్టి బయటకు వచ్చింది.

చంద్రుడు బాగా పైకి లేచాడు. వెన్నెల కిరణాలు పడి, కాలువలో పారుతున్న నీళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. సర్వితోటలోని పిట్టలు నిద్రపోతున్నట్లున్నై. సవ్వ డేమీ విన్పించటంలేదు. మంచం కోడు కానుకుని కూర్చొన్న మల్లి మసక వెలుతురులో రోడ్డు చివరిదాకా ఒకసారి చూసి, "మాఁవింకా రానేదు. ఏమైపోయిండో!" అనుకుంది.

*    *    *

అనుకోకుండా ఆమె దృష్టి గుడిసెకు కొంచెం వెనుకగా వున్న మెరక మీద పడింది. తనకేమీ తోచనప్పుడు దానిమీదే పడుతుంటాయి కళ్ళు. తన తల్లి, తమ్ముడు ఉన్నపుడు తమ గుడిసె దానిమీద ఉండేది. ఆ మనుషులూ, గుడిసె ఇప్పుడు లేకపోయినా ఎండకూ, వానకూ కొంచెం కొంచెం కారిపోతూ యింకా ఆ దిబ్బ గుర్తుగానే ఉంది.

ఆరోజు, తండ్రి వెళ్లిపోయిన రోజు రాత్రే కాబోలు తమ్ముడికి జ్వరం తీవ్రంగా వచ్చింది. తల్లి దిష్టి తీసేసి, "తెల్లారేపేలకి పోద్దిలే" అంది. కాని తెల్లవారేసరికి జ్వరమైతే కొంచెం తగ్గిందిగాని ఒళ్లంతా ఎర్రగా దద్దురు కన్పించింది. తన తల్లి కళ్లల్లో ఆరోజు ఆందోళన స్పష్టంగా చూసింది తను. అప్పుడు వెంటనే మంగమ్మత్తనే పిల్చుకు వచ్చింది. అత్త చూసి, "ఆఁ! అదేనే పిల్లా అనుమాన మేంది! పూరంతా పొక్కిపోనాదంటగా. కొంచెం జాగత్తగుండు." అని చెప్పి తనను తీసుకుని బయటకు వచ్చింది. ఆ మూడు రోజులూ మల్లి తల్లి పనిలోకి వెళ్లలేదు. మల్లిని మాత్రం మంగమ్మ తన దగ్గరే ఉంచుకుంది. తమ్ముడిని ఒకసారి కూడ చూడనివ్వలేదు, మూడో రోజునో, నాలుగో రోజునో ఒక సాయంత్రం తనను బయట కూర్చోబెట్టుకుని జడ వేస్తోంది మంగమ్మత్త. తల్లి ఇంట్లోనుంచి ఒక్కసారి పెద్దగా ఏడుస్తూ బయటికి వచ్చి, "మంగొదినో, నేనేం సేయనే, నా బిడ్డ పోయిండే!" అని జుట్టు పీక్కుంటూ, నేలమీద కూలబడిపోయింది. అప్పుడు కూడ తనని తమ్ముడు దగ్గరకు పోనీయలేదు. చీకటి పడిన తర్వాత ఈ రాములే తమ గుడిసెలోనుంచి తెల్లగా గుడ్డ చుట్టిన వస్తువు దేన్నో భుజంమీద వేసుకుని తీసుకుపోయా డెక్కడికో. మర్నాడుగాని అదేమిటో, ఏమైందో అర్థంగాలేదు తనకు.

తర్వాత రెండేళ్లకు కాబోలు తను పెద్దదయింది. అప్పటికి తన తల్లి రైలుకట్ట దగ్గిర పని చేస్తోంది. కొత్తగా వేసిన రైలు పట్టాలకు ఆడ కూలీలు కంకర మోస్తుండేవాళ్ళు. తనుకూడ పనికి వస్తానని పట్టుపట్టింది మల్లి చాలా సార్లు. కాని తల్లి ఒప్పుకోలేదు. "నా ముప్పై రూపాల సంపాదన సాలకపోతే గంటే దిగులు. నువ్వూ వద్దు, నీ పనీ వద్దు. ఇంటికాడే ఉండు" అని మంగమ్మత్తను పిలిచి తనను ఒప్పచెప్పి మరీ వెళ్లేది పనికి.

"సిన్నపిల్ల, దాని కేమే, తీసుకుపోనాదా ?" అనేది మంగమ్మత్త. కాని తన తల్లేమీ మాట్లాడకుండా వెళ్లిపోయేది.

ఆరోజు బట్వాడా ఇస్తారని తన తల్లి చాల ఉత్సాహంగా ఉంది. ముందు తన కో మంచి వోణి, పరికిణి తెస్తానంది. మధ్యాహ్నం వాన పడుతుంటే అమ్మ

కోసం ఎదురుచూస్తూ సాయంత్ర మెపుడవుతుందా అని ఆదుర్దా పడుతోంది మల్లి. ఆవాన సాయంత్రం వరకు తగ్గలేదు. తల్లి వచ్చేలోపల అన్నం వండు దామని పొయ్యి రాజేస్తోంది తను.

ఇంతలో బయటనుంచి "మల్లీ" అని పిలుపు వినిపించింది. ఎవరోనని బయటికి వచ్చేసరికి వీరన్న మంచుని ఉన్నాడు.

"గంగులు తాత, రాములు పిలుత్తుండారు నిన్ను. ఓసారి వచ్చి పోదువు రా."

అతని వెనకనే తనూ వాళ్ల ఇంటి దగ్గరకు వెళ్లింది. గంగులు తాతేదో నెమ్మదిగా చెప్తున్నాడు. మంగమ్మత్త నోరు తెరుచుకుని వింటోంది. తనని చూడంగానే గంగులుతాత లేచి, "రాములూ! నే పోతుండారా. ఆ సంగతి చెప్పి మిగతా పనేదో సూడు. ఆడు రెండేళ్లనుంచి అయిపూ, ఆనమాలూ లేకుండానే పాయె" అంటూ వెళ్లిపోయాడు.

మంగమ్మత్త తనను దగ్గరకు తీసుకుని మంచం వాల్చి, దానిమీద కూర్చోబెట్టుకుంది. రాములు కొంచెం దగ్గరకు వచ్చి నేలమీద చతికిలపడి కూర్చున్నాడు. జేబులోనుంచి పొగాకు కాడ తీసి, దాని ఈనెలు నెమ్మదిగా తీస్తూ "సూడు మల్లెమ్మా, ఇదివరకి మల్లే కాదుగెందా. ఇప్పుడు కాత్తె పెద్దదానివైతివి. నువు కొంచెం ధైర్యం, అదీ సిక్కబట్టుకుని ఉండాల, ఏం?" అని ఆగాడు. రాములు ఈమాట లెందుకు చెప్తున్నాడో తన కర్థం కాకపోయినా, గుండెల్లో భయంలాంటి దేదో ఆవహించి, నోట మాట రాలేదు. అలాగే కళ్లు పెద్దవి చేసుకుని రాములు మొహం చూస్తోంది.

"పాపం, తమ్ముడు సచ్చిపోనాడనుకో. అయ్యేమో అంతే నేకపోయె. ఇగ.....ఆటితోపాటు అమ్మ గూడ......"

అంతే! తర్వాత తనేమీ వినలేదు. కాళ్ల క్రింద భూమి లోపలి కెక్కడికో పడిపోతున్న ట్లనిపించింది. ఒక్కసారి పెద్దగా "అమ్మ యాఁవయిందత్తా" అంటూ బావురుమని మంగమ్మత్త వళ్లోకి పడిపోయింది.

తర్వాత మల్లీ తనకు ఒళ్ళు తెలిసేసరికి చుట్టూ చీకటిగా వుంది. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. తన తలప్రక్కనే కూర్చుని వీరన్న విసురుతూ, "మల్లీ మల్లీ"అని నెమ్మదిగా పిలుస్తున్నాడు. తనకు వెంటనే తల్లి మరణం గుర్తుకు వచ్చింది. రెండు చేతుల్తోను ముఖం కప్పుకుని ఏడుస్తుంటే గుడిసెలో నుంచి మంగమ్మత కేకేసింది.

"అది లేసిందంట్రా ఈరన్నా! లెగితే యేడిగా ఈ గంజిబట్టు కూతెంత, తేరుకుంటది."

లేచి పోబోతున్న వీరన్నను తను ఆపి, "అమ్మ ఎట్టా సచ్చిపోనాదంట మాఁవా?" అని అడిగింది.

"ఆల్లంతా మద్దేనపేల పనిసేత్తుంటే తా నొచ్చినాది. దాపున యాడ నీడే లేదంట. టేశన్ సెడ్డ దూరం గుంటంలో ఆడికెల్లలేక, ఆడో గూడ్సుబండి ఆగుంటే దానికింద సేరిండ్రంట ఈల్లంతా. ఆ వానలో బండి కదిలి, ఒక్క నాగు నాగేపాటికి, గాబరా పడిపోయి బయటికి దూరబూయింద్రంట. మెడకాయలు కొందరికి, కాలుసేతులు కొందరికి తెగిపోనై. పదిమందిదాకా సచ్చిపోనారంట."

తనకోసం అన్ని అవస్థలు పడుతూ, అంత ప్రేమగా పెంచుతున్న తల్లి, ఇంత దారుణంగా మరణించిందంటే కల అనిపించింది. తల్చుకుంటుంటే ఏడ్పు ఆగలేదు. వీరన్న తొడ చాటున మొహంపెట్టి "నేనేఁవైపోను మాఁవా? నా బతు కేంగాను?" అని ఏడ్చింది. వీరన్న బలవంతంగా తన తలను ఒళ్లో పెట్టుకుని,

"సూడు మల్లీ, అత్తమ్మ సచ్చిపోనమాత్తరానికి నివ్వూ, నీ బతుకు ఏఁవైపోతదా? ఇదుగో, యిట్టనే ఉంటరు" అన్నాడు తన ముఖం మీది జుట్టును పక్కకి తీస్తూ. ఆ మాటల కర్థమేమిటో తన కర్థం కాలేదు అప్పుడు. లేచి కూర్చుని, "మరి అమ్మకాడికి ఎల్లద్దా మాఁవా? అమ్మని సూడద్దూ?" అని అడిగింది.

వీరన్న కొంచెం సేపు ఆగి, తాపీగా అన్నాడు, "ఏం సూస్త వాడ? శవాల్ని ఆసిపత్రికాడికి తీసుకుపోయింద్రు. రాములు ఆడికిపోయి వచ్చిండుగెందా! అత్తమ్మకు, కంటం, బుజాలు తెగిపోనయ్యంట. దిక్కులేనోల్లని ఆల్లే పూడ్చి పెట్టరు. ఇప్పుడిగ మనం పోయి సేసే దేవుం దాడ?"

తర్వాత ఎలాగో రెండు మూడు నెలలు గడచి పోయినాయి. మంగమ్మత్త దగ్గరే ఉంది మల్లి. ఒక రోజు వీరన్నకూ, తనకు చద్దెన్నం పెడుతూ మంగమ్మ,

"ఏమే మల్లీ, పెద్ద పిల్లవయితివి గెందా? ఎంత కాల మిట్టుంట పీడ?" అని అడిగింది.

తనకు; నోట్లో పెట్టుకోబోయే ముద్ద చేతులోనుంచి జారి కంచంలో పడిపోయింది. అంటే తన నిక బయటికిపోయి, తన బ్రతుకు తనను చూసుకోమని అంటోందా అత్త? దిక్కు లేకుండ ఇంత నగరంలోకి పోయి తనెక్కడ ఉండగలదు? ఒంట్లో రక్తం పొంగి, దుఃఖం ముంచుకు వచ్చింది. కళ్లలో నీళ్లు తిరుగుతుంటే, పళ్లతో బిగబట్టుకుని ప్రక్కన వున్న వీరన్నమీద ముఖం చూసింది. అతడు తల వంచుకుని ముసి ముసిగా నవ్వుకుంటున్నాడు. తన కర్థం కాలేదు. ఇంతలో మంగమ్మత్త తన దగ్గరగా కూర్చుని, "ఏందే, మాట్లాడవ్? యిట్టం నేదేటి?" అని అడిగింది.

తను అలాగే ఎంగిలితోనే మంగమ్మత్త భుజాలమీద చేతు లేసి కావిలించుకుని గుండెల్లో బరువంతా దిగిపోయేట్లు ఏడ్చింది. తన వీపు నిమురుతూ మంగమ్మత్త అంది. "నిన్ను బజార్న తోల్త ననుకుంటివేటే ఎఱ్ఱి మొగమా? వారం లోపటే ముడెట్టిత్త, సూస్తుండు."

* * *

గతాన్ని తల్చుకుంటూ మల్లి అత్తవైపు చూసింది. వెన్నెల్లో హాయిగా నిద్ర పోతున్న మంగమ్మను చూస్తుంటే ఆమె హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. మల్లి నిట్టూరుస్తూ అనుకుంది, "బక్క చిక్కిపోన ఈ శర్మంలో అంత పెద్ద గుండె నెట్ట పెట్టిండు బగమంతుడు. అత్తే నేక పోతే నేనేమై పోదును?"

ఏదో పిట్ట పెద్దగా అరుచుకుంటూ సర్వి తోటలోనుంచి ఎగిరి కాలువ మీదుగా పోయింది. చుట్టు గుడిసెల్లో సందడి గూడ నెమ్మదిగా సద్దు మణుగుతోంది. వీరన్నకోసం రోడ్డు చివరిదాకా ఒక సారి చూసింది మల్లి. వస్తున్న జాడేమీ కన్పించ లేదు. మంచంకోడు కానుకుని కళ్లు మూసుకుంది.

"ఏందే తడికె తీసే కునుకు తీస్తుండవే? కుక్కలు కుండెత్తికెల్తే అవుద్ది" అంటూ వీరన్న భుజం పట్టుకుని కదుపుతుంటే మెలకువ వచ్చింది మల్లికి. లేచి నుంచుంటూ, "ఎటెల్తివి మావా? పొద్దు టేలనుండి అంతూ పొంతూ నేకపోతివే?" అంది.

వీరన్న వచ్చిన అలికిడికి మంగమ్మ కూడ లేచి కూర్చుంది. అప్పుడు అతడు గుడిసె ప్రక్కనే పరిచిన రాళ్లమీద నుంచుని బానలో నీళ్లు ముంచి పోసుకుంటున్నాడు. మల్లి కొంచెం ప్రక్కగా నుంచుని ఏవో మాటలు చెప్తోంది. అందులో మంగమ్మకు "సుబ్బులు", "దొంగసారా" అది ఏవో కొద్దిగా మాటలు విన్పించినాయి.

"ఏందే, మల్లీ అది? సుబ్బులేంది, సారా ఏంది?"

"మన సుబ్బులు సంగతి కాదులే అత్తా. పొయ్యి బువ్వ తినరాదూ, పొద్దుపోతుంటే."

ముసలి మంగమ్మ నెమ్మదిగా లేచి ఏమిటో గొణుక్కుంటూ లోపలికి పోయింది.

వీరన్న స్నానమయింది. ఒళ్లు తుడుచుకుంటూ, "ఇయ్యాల మన సంగతి యింటివంటే మల్లే! నే పోయేతలికి రిచ్చా నేదు. సావుకారు పదిరిచ్చాలూ అమ్మేసిండంట మంచి బేర మొత్తే. నిన్న మాపటేలనే రాత కోతలన్నీ గూడ ముగించుకున్నడు. అయిద్రాబాదు పోయి ఏ యిల్లో, పొలమో కొంటడంట." మల్లి ఏదో అడగబోయి మళ్లీ ఆగిపోయింది. వీరన్నవంక చూస్తూ నుంచుంది.

"ఇయ్యాల్టి కేదో దొరికిందిలే. ఆ గోడవున్న కాడ లారీలకి సరు కెత్తిండ్రు. ఆడ ముటాలో పని చేసొచ్చినా. మల్లీ రెండు మూడు రోజులదాకా పనిలేదు పొమ్మన్నారు. రేపేమన్నా ఎతుక్కోవాల" అన్నాడు వీరన్న.

మల్లేమీ మాట్లాడకుండా పోయి, వెదురు మీద ఆరేసిన పంచ, బనీను తీసుకువచ్చి అందించింది. మల్లి మౌనానికి వీరన్న కొంచెం నవ్వి అన్నాడు, "ఏందే అంత దిగాలుపడిపోతివి? పని చేసేవోడికి కూలే దొరక్కపోద్దా?"

ఇంతలో మంగమ్మ ఒక చెంబుతో మంచి నీళ్లు తీసుకుని, గుడిసెలోనుంచి బయటకు వచ్చింది.

"తెల్లారి బుడ్డోడి జరం సంగతి సూద్దా యీరయ్యా, మునిమాపుకాడ ఏడ్చినాడు ఏడ్చినట్టే ఉండడు" అని చెంబులో నీళ్లు కాసిని గొంతులో పోసుకుని చెంబు మంచంక్రింద పెట్టుకుని మేను వాల్చింది.

మల్లి లోపలికిపోయి వీరన్నకి అన్నం పెట్టింది. ప్రక్కన ముక్కాలిపీటమీద కిరసనాయిలు బుడ్డి వెలుగుతూ, నల్లని పొగ వదులుతోంది. రోడ్డు ప్రక్కనే వున్న మలబారు సాయిబు టీ కొట్లోనుంచి రేడియో పాట గోల గోలగా విన్పిస్తోంది. సాయంత్రం నుంచి మల్లి మనసు చికాగ్గా ఉంది. దానికితోడు మర్నాటి నుంచీ వీరన్న కూలి వెతుక్కోవాల్సి వస్తుంది అనే భావం ఆందోళన కల్గిస్తోంది.

"అయితే మావా! గూడ్సు సెడ్డు వాగన్ల కాడ రోజువారి పని దొరుకుద్దిగా. గంగులుతాత మేస్త్రీ పని సేస్తున్నడు గెందా. ఏదన్న ముటాలో పనీమంటే ఏవంటడో!"

గుడిసె వాకిలికి కట్టిన తడిక చప్పుడయింది. వెనుక తిరిగి చూసేసరికి రాములు కన్పించాడు మల్లికి. అతడు వస్తూనే, "ఏందిరిది? ఇంత పొద్దోయి వచ్చినావు? అది సరే. ఇన్నావుగా సంగతి. మనాడు కూడ పట్టుబడిండు. పోలీసు టానాలో కనపడిండంట. బాధపడమాక. రెండు మూడు నెలల్లో తిరిగొస్తడులే. అంతకంటె ఎయ్యరు" అని బుడ్డి దీపానికి చుట్ట ముట్టించుకుని లేచాడు. అతనితోపాటు వీరన్నా కూడ చేయి కడుక్కుని బయటికి వచ్చాడు.

మల్లి పని తెముల్చుకుని బయటికి వచ్చేసరికి మంగమ్మ పక్కన పడుకున్న పిల్లవాడు ఏడుస్తున్నాడు. పచ్చగా మొలిచిన గడ్డిమీద ఈతాకుల చాప పరుచుకుని, వెన్నెల్లో పడుకుని ఉన్నాడు వీరన్న. గుడిసె తడికె దగ్గరకు లాగి, త్రాడు గట్టిగా కట్టి, పిల్లవాణ్ణి ఎత్తుకుని వీరన్న పక్కన వచ్చి కూర్చుంది మల్లి.

వాడికి పాలిస్తుంటే సుబ్బులు జ్ఞాపకం వచ్చాడు. చిన్నప్పటినుంచి ఎంత అమాయకంగా పెరిగాడు? అలాంటిది తనకూ, అన్నకూ కూడ తెలియకుండా ఇన్ని పనులుచేసి, పోలీసుల చేతుల్లో పడిపోయినాడంటే ఆశ్చర్యమేసింది మల్లికి. ఏమయినా రెండు, మూడు నెలలు జైల్లో ఉండాల్సిందే. చిన్నపుడెపుడో తన తండ్రి కూడ బేడీ లేయించుకున్నాడని వింది. ఆఖరుసారి తను పెట్టిన అన్నం తిని చేతులూపుకుంటూ పోతున్న తండ్రి, తన ముఖంలోకి ఆప్యాయంగా చూస్తూ క్రొత్త పరికిణి, వోణి కొని పెడతానంటున్న తల్లి ఒకసారి మనస్సులో మెదిలారు.

ఒళ్లోవున్న పిల్లవాడి ఒంటిమీద చెయ్యి వేసి చూసి అనుకుంది, "ఆ రోజులూ, ఈ రోజులూ గూడ ఒక్కలాగే వచ్చినాయి. ఎలా గెల్లిపోను ఈ జలమలన్నీ."

మర్నాటినుంచి కూలికోసం వెతుక్కోవలసిన వీరన్న నిశ్చింతగా గుర్రుకొడుతూ నిద్రపోతున్నాడు. చాప మీద ఒక ప్రక్కన పాత దుప్పటి మడతపెట్టి, పరిచి, పిల్లవాణ్ణి పడుకోబెట్టింది మల్లి.

రోడ్డుమీద జనసంచారం ఆగిపోయింది. సాయిబు హోటల్లోని రేడియో పగలంతా అరిచీ, అరిచీ అలిసిపోయి నోరు మూసుకుంది. మర్రిచెట్టు క్రింద పడుకున్న ముసలివాడి మైకం ఇంకా దిగినట్లు లేదు, "ఒచ్చే, ఒచ్చే, వాన జల్లు, గూడుసేరవె రామ సిలక" అని లల్లాయి పదాలు పాడుతున్నాడు. కాలువలో పారే నీళ్లు, అంచునవున్న కొండ రాళ్లకు తగిలి చప్పుడు చేస్తున్నాయి. దుఃఖాలు, కష్టాలు, పాపాలు కడుపునిండా నింపుకుని, మత్తుగా పడుకున్నాయి గుడిసెలన్నీ.

కొంచెం ఎడంగా ముసలి మంగమ్మ హాయిగా నిద్ర పోతోంది.

నందివర్ధనం పువ్వులా, చల్లగా, తెల్లగా వెలుగుతున్న చందమామను చూస్తున్న మల్లికి పెదవులమీద సన్నని దరహాసం విరిసింది. చందమామనుంచి కళ్లు, పక్కనే పడుకున్న వీరన్నమీదకు తిప్పి, అతని నడుం మీద చెయ్యివేసి కదుపుతూ అంది,

"ఎన్నెట్లో అపుడే ఏం నిదర మావా, కొంచెం అసింట జరుగు."

శాస్త్రమాచార్యసన్నిధి జదువ డేని,
ఇద్దబోధంబు మది సంగ్రహింపడేని,
దెగువమీఱి ప్రతిజ్ఞ సాధింప డేని,
జ్ఞాతి జయమంద డేని తజ్జనుడు జనుడె?

(శ్రీనాథుడు—కాశీఖండం)